క్లుప్తంగా

చెక్కు అందజేత



జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన కుంబోజు మహేశ్వర్, అలేఖ్య దంపతుల కుమారుడు గౌచర్ డీసీసీ-1 అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి చికిత్స కోసం రూ.5 లక్షల చెక్కును హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య పాల్గొన్నారు. కాగా, తమ కుమారుడి వైద్య చికిత్సకు చెక్కును అందజేయడం పట్ల తల్లిదండ్రులు మహేశ్వర్-అలేఖ్య వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్‌ఓసీ..



జనగామ: నర్మెట మండలం ఇప్పలగడ్డకు చెందిన బి.నారాయణ వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.50లక్షల ఎల్‌ఓసీని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం అందజేశారు. అలాగే అదే మండలంలోని సోలిపురానికి చెందిన టి.బాల్‌రాజుకు రూ.75వేల ఎల్‌ఓసీ మంజూరు కాగా కొమ్మూరి చేతుల మీదుగా అందజేశారు.

బాధ్యతల స్వీకరణ



రణధీర్‌రెడ్డి, ఏడీఈ

స్టేషన్‌ఘన్‌పూర్: టీజీ ఎన్‌పీడీసీఎల్ స్టేషన్‌ఘన్‌పూర్ సబ్ డివిజన్ ఏడీఈగా పాల్వాయి రణధీర్‌రెడ్డి సోమవారం స్థానిక ఏడీఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. హన్మకొండ విద్యుత్ భవన్‌లో ఏడీఈగా పనిచేస్తున్న రణధీర్‌రెడ్డి బదిలీపై వచ్చి ఇన్‌చార్జ్ ఏడీఈ లక్ష్మీనారాయణ నుంచి ఘన్‌పూర్ ఏడీఈగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏఈలు, సబ్‌ఇంజనీర్లు, విద్యుత్ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సన్మానించారు. ఏఈలు శంకర్, శివకుమార్, విశ్వసాహితి, మహేందర్‌రెడ్డి, సబ్ ఇంజనీర్ హరిత, ఓ.యాదగిరి, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈగా బీఎస్‌రెడ్డి



దేవరుప్పుల: మండల విద్యుత్‌శాఖ ఏఈగా బొడుగం నర్సింహారెడ్డి .(బీఎస్‌రెడ్డి) సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న ఏఈ సుధాకర్ నర్మెటకు బదిలీకాగా ఆయన స్థానంలో పడమటికేశవపురంలో ఏఈగా ఉన్న బీఎస్‌రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా బీఎస్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు శాఖపరంగా మెరుగైన విద్యుత్ సరఫరా అయ్యేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు.

నియామకం

పాలకుర్తి: మున్నూరు కాపు సంఘం జిల్లా కార్యదర్శిగా పాలకుర్తి మండలానికి చెందిన వీరమల్ల రాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి రాజుకు నియామకం పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎంపి వద్దిరాజు రవి చంద్ర, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మున్నూరు కాపు సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సారయ్య

మండల కేంద్రానికి చెందిన మాచర్ల సారయ్య సీపీఎం మండల కార్యదర్శిగా ఎన్నికయ్యారు. చిట్యాల ఐలమ్మ స్మారక భవనంలో నిర్వహించిన పార్టీ మహాసభలో సోమవారం ఆయనను ఎన్నుకున్నారు. సారయ్య రెండో సారి మండల కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

గ్రామశాఖ అధ్యక్షుడిగా యాదగిరి

తరిగొప్పుల: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు అంకుషాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడిగా చిన్నమూర్తి యాదగిరి, ఉపాధ్యక్షుడిగా బట్టు మహేందర్‌రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా అబ్బి నాగభూషణం నియమిస్తున్నట్లు మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం యాదగిరికి అందజేశారు. లూకా, మందచంద్రయ్య, పోషయ్య, భిక్షపతి, ఇంద్రారెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మండల కమిటీ ఎన్నిక

లింగాలఘణపురం: మండల కేంద్రంలో సోమవారం ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ టెక్నీషియన్ ఫెడరేషన్ అండ్ ప్లంబర్ అసోసియేషన్ మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు ఇట్టబోయిన కుమార్ సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గట్టగల్ల రమేష్, ఉపాధ్యక్షుడిగా ఎద్ల వసంత్, కార్యదర్శిగా ఆకుల వెంకటేష్ ఎన్నికయ్యారు.

పోలీసు అమరులకు నివాళి



లింగాలఘణపురం: నివాళులర్పిస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు



కొడకండ్ల: నివాళులర్పించిన ఎస్సై రాజు, సిబ్బంది



నర్మెట: నివాళులర్పిస్తున్న ఎస్సై నరేశ్ తదితరులు

లింగాలఘణపురం: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో శాంతి స్తూపం వద్ద ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు. కార్యక్రమంలో నాయకులు ఏదునూరి వీరయ్య, పాల కేంద్రం చైర్మన్ తిరుమల్, రాజశేఖర్, యాకయ్య, ఆగయ్య పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి


కొడకండ్ల: ప్రజల శ్రేయస్సు, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని ఎస్సై చింత రాజు అన్నారు. సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అమరవీరుల స్తూపం వద్ద సిబ్బందితో ఎస్సై పోలీస్ అమర వీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై కత్తి రమేశ్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

నర్మెటలో..

నర్మెట: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేశ్ మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్య కార్యకర్తకు దక్కిన గౌరవం

- ఎన్‌ఎస్‌యూఐ నుంచి యూత్ కాంగ్రెస్ వరకు ప్రస్థానం
- బనుకకు కొమ్మూరి కొండంత అండ
- కష్టపడిన వారికి కాంగ్రెస్‌లో గుర్తింపు



ఏఎంసీ చైర్మన్ శివరాజ్‌ను సత్కరిస్తున్న కొమ్మూరి

జనగామ: జనగామ మార్కెట్ చరిత్రలో ఓ సామాన్య కార్యకర్తకు పట్టం కట్టారు. రెండున్నర దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని.. నమ్మకస్తుడిగా అందరిని కలుపుకుపోతూ పని చేస్తున్న జనగామ మండలం శామీర్‌పేటకు చెందిన పేదకుటుంబాంలో జన్మించిన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్‌కు జనగామ ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం దక్కింది. డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి కుడి భుజంగా మొదటి నుంచి పని చేస్తూ, పార్టీ అభివృద్ధికి కంకణ బద్ధులై కష్టపడుతున్న శివరాజ్‌కు అత్యున్నత గౌరవం దక్కింది. కాంగ్రెస్‌లో కష్టపడేవారికి మంచి అవకాశాలు వస్తాయనే దానికి నిలువెత్తు నిదర్శనంగా బనుక ఆదర్శంగా నిలుస్తున్నాడు.

కొమ్మూరి పట్టుదలే..

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరికి అత్యంత నమ్మకస్తుడిగా ముద్ర వేసుకున్నాడు. యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉన్న శివరాజ్‌కు పార్టీలో కింది స్థాయి నుంచి పైవరకు సౌమ్యుడిగా పేరుంది. రాజకీయాల్లో సైతం ఎత్తులకు పైఎత్తులు వేస్తూ..తనను నమ్ముకున్న వారికి న్యాయం చేయాలనే సంకల్పం బనుకలో కనిపిస్తుంది. విద్యార్థి నాయకుడిగా అంచెలంచెలుగా ఎదుగుతూ కాంగ్రెస్‌లో ఓ స్థానం పదిలపరుచుకున్న శివరాజ్.. నేడు ఉమ్మడి జిల్లాలోని పెద్ద మార్కెట్లలో ఒక్కటైన జనగామ ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం రావడం కష్టానికి ఫలితమే అని చెప్పుకోవచ్చు. శివరాజ్ పనితీరు, కష్టపడే మనస్తత్వం కళ్లారా చూసిన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి.. మార్కెట్ చైర్మన్ ఇతనికే ఇవ్వాలని పట్టుబట్టారు. మార్కెట్ చైర్మన్ పదవిపై నాలుగు నెలలుగా ఉత్కంఠత రేకెత్తించినా, అధిష్టానంతో కొట్లాడి తాను ముందుగా అనుకున్న కమిటీనే ఫైనల్ చేయించారు కొమ్మూరి. కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని శివరాజ్‌కు ఇచ్చిన పదవితో కొమ్మూరి నిరూపించుకున్నాడు.

రోడ్డు నిబంధనలు విస్మరిస్తే నిండు జీవితాలు బలి

- గొల్లపల్లి రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు



మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

దేవరుప్పుల: వాహనదారులు తొందరపాటుతో రోడ్డు నిబంధనలు విస్మరిస్తే నిండు జీవితాలు బలి అవుతాయని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొల్లపల్లి బస్‌స్టేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పొందిన యువకుల మృతదేహాలను జనగామ ఏరియా ఆస్పత్రిలో ఎస్సై ఊర సృజన్‌కుమార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ విషయమై సీఐ మాట్లాడుతూ పొట్టికూటీ కోసం సుదూర ప్రాంతాల నుంచి యువత వాహన వేగం వల్లే క్షణికంలో రోడ్డు ప్రమాదానికి గురై ఆ కుటుంబాలకు పెద్ద దిక్కు కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. విధిగా మోటరు సైకిల్ వాహనదారులు హెల్మెట్ ధరించి రోడ్డు నిబంధనలు పాటిస్తే ఇలాంటి ఘోర రోడ్డు ప్రమాదంలో తమ ప్రాణాలను పరిరక్షించుకునే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రమాదంలో మృతి చెందిన ఏపీలోని కర్నూల్ జిల్లా యెమ్మిగనూర్ మండలం మొగితి గ్రామానికి చెందిన బోయ నర్సింహుడు, తెలంగాణలోని వనపర్తి జిల్లా మదనపల్లి మండలం దూపెల్లికి చెందిన పీర్ల భరత్‌గా సమగ్ర సమాచారాన్ని గుర్తించామన్నారు. అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం చేసి అప్పగించామన్నారు.

క్రైం కార్నర్

ట్రాక్‌పై పడిన మహిళ



మహిళకు చికిత్స అందించాలని ఆదేశిస్తున్న ఎంపీ

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం రైల్వే స్టేషన్‌లో ఓ మహిళ ప్లాట్‌ఫాం పైనుంచి ఆకస్మాత్తుగా ట్రాక్‌పై పడింది. జనగామ జిల్లాకు చెందిన నాగమణి రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై ఉండగా ఒక్కసారిగా ట్రాక్‌పై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో అప్రమత్తమైన తోటి ప్రయాణికులు ఆమెను పైకి తీసుకొచ్చారు. అదేసమయాన స్టేషన్‌లో తని ఖీకి వచ్చిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఆమెను పరామర్శించి ఆస్పత్రికి పంపించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పాలకుర్తి టౌన్: ద్విచక్రవాహనం చెట్టుకు ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలైన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం నందానాయక్ తండాకు చెందిన భూక్య రాజు(20), అదే మండలానికి చెందిన బాధవత్ సతీష్ మహబుబాబాద్ జిల్లా తొర్రూరు నుంచి పాలకుర్తికి ద్విచక్రవాహనం వస్తుండగా ఆదివారం రాత్రి మండలంలోని నారబోయిన గూడెం శివారులో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో బైక్ వెనుక కూర్చున్న భూక్య రాజుకు బలమైన గాయాలయ్యాయి. రాజును మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. రాజు తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక..

పాలకుర్తి: మల్లంపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో మేక సోమవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన దేవరాయ వెంకన్నకు చెందిన మేక మేతకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి మృతి చెందింది. నష్ట పరిహారం చెల్లించాలని వెంకన్న కోరారు.

గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య

పాలకుర్తి టౌన్: గుర్తుతెలియని వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి మండలంలోని మైలారం శివారులో జరిగింది. ఎస్సై లింగారెడ్డి కథనం ప్రకారం.. మైలారం మామిడితోటలోని రేకుల గదిలో గుర్తు తెలియని వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి మెరూన్ కలర్ షర్టు, నల్ల ప్యాంట్ తోపాటు తెల్ల గడ్డం ఉందని, గుర్తుతెలియని వృద్ధుడిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమవారం తెలిపారు. శవ పంచనామా అనంతరం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. వివరాల కోసం పాలకుర్తి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో ఉమ్మడి జిల్లాకు ఎంపికైనట్లు పీడీ కిష్టయ్య తెలిపారు. ఇటీవల జనగామలో జరిగిన 14 ఏళ్ల లోపు బాలిక వాలీబాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుపొందడమే కాకుండా ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు భవానీ, రుష్మితో పాటు బాలుర విభాగంలో దుర్గాప్రసాద్ ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను హెడ్మాస్టర్ మల్లికార్జున్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కెపాసిటర్లతో విద్యుత్ ఆదా..

పాలకుర్తి టౌన్: విద్యుత్ ఆదా చేయడానికి రైతులు విద్యుత్ పంపు సెట్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని విద్యుత్ శాఖ స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ డీఈ రాంబాబు రైతులకు సూచించారు. సోమవారం తెలంగాణ ఉత్తర విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని శాతాపురంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ రాంబాబు మాట్లాడుతూ విద్యుత్ పంపు సెట్‌కు కెపాసిటర్ అమర్చక ముందు 10 ఆంప్స్ ఉన్న విద్యుత్ కెపాసిటర్ అమర్చాక 7 ఆంప్స్‌కు తగ్గిందని తెలిపారు. ప్రతి ఒక్క రైతు కెపాసిటర్ అమర్చుకుని విద్యుత్ ఆదాకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా రైతు లోనే శ్రీను విద్యుత్ పంపుసెట్‌కు కెపాసిటర్ అమర్చారు. ఏడీఏ ఆవిరినేని రణధీర్,ఏఈలు సత్తయ్య, సిబ్బంది కాంతయ్య, రమేష్, వెంకన్న, సోమనాథం,బాలజీ, యాకుబ్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న రజితకృష్ణమూర్తి

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మార్కండేయ దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన పొట్లపల్లి రజితకృష్ణమూర్తి రూ. లక్ష విరాళంగా గుడి నిర్మాణ అధ్యక్షుడు, మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గజ్జెల దామోదర్‌కు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో యాదగిరి, సామల రాములు, డాక్టర్ అశోక్, నాగభూషణం, కుమారస్వామి, సుధాకర్, సంతోష్, వంగ సుధాకర్ పాల్గొన్నారు.

'ప్రభుత్వం, పోలీసుల వైఫల్యంతోనే శ్రీను ఆత్మహత్య'



మాట్లాడుతున్న గాంధీనాయక్

పాలకుర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల వైఫల్యంతోనే గిరిజన యువకుడు లకావత్ శ్రీను నాయక్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని బీఆర్‌ఎస్ నాయకుడు, టీసీసీ మాజీ చైర్మన్ ధరవత్ మోహన్‌గాంధీ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, రైతు బంధు సమితి జిల్లా మాజీ డైరెక్టర్ జరుపుల బాలు నాయక్, ఓయూ జేఏసీ నాయకుడు గుగులోత్ రాజేష్‌నాయక్‌లతో కలిసి గాంధీ నాయక్ మాట్లాడారు. స్థాయిని మరిచి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును విమర్శించడం హాస్యాస్పందగా ఉందన్నారు. ఈనెల 18న పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో గిరిజన యువకుడు లకావత్ శ్రీను ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో శ్రీను కుటుంబానికి న్యాయం చేయాలని, ఎస్సై, సీఐపై చర్య తీసుకోవాని బాధ్యులను శిక్షించాలని గిరిజన సంఘలతో ఆందోళన చేస్తే జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు దయాకర్‌రావును విమర్శిస్తున్నారని అన్నారు. ఎంబీబీఎస్ విద్యార్థిని ప్రీతి కుటుంబానికి దయాకర్‌రావు అండగా నిలిచారని, శ్రీను కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండాగా నిలవాలని డిమాండ్ చేశారు. సొసైటీ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పూస్కూరి శ్రీనివాస్‌రావు, నాయకులు యాకుబ్, మహేందర్‌నాయక్, వెంకట్,మాచర్ల ఎల్లయ్య,తాడెం రవి, నాగరాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ప్రకాశ్

జనగామ రూరల్: పట్టణంలో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో కొలిపాక వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన లక్ష్మీబాయి కుంట గిర్నిగడ్డ ఏరియా సీపీఎం మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పారిశుద్ధ్య సమస్యతో పట్టణ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు చుంచు విజేందర్, ఎండీ గౌస్య ఎండీ నాజియా మల్లమ్మ, యాదమ్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యదర్శులను ఎన్నుకున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంపై చర్య తీసుకోండి

జనగామ: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రంలో వైద్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బచ్చన్నపేట మండలం గోపాల్‌నగర్‌కు చెందిన బాలిక సిరి తండ్రి గంగరబోయిన మహేందర్ సోమవారం కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన తన కూతురుకు జ్వరం వస్తే ఎంసీహెచ్‌కు తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఓపీలో పేరు నమోదు చేసి 126 నంబర్‌లోని డాక్టర్ వద్ద చూపించుకోగా రక్త పరీక్షలు చేయించుకోవాలని చెప్పగా మరుసటి రోజు చంపక్‌హిల్స్ ఎంసీహెచ్‌లో శాంపిళ్లను తీసుకున్నారన్నారు. అదే రోజు మొబైల్‌కు రిపోర్టు సమాచారం వస్తుందని చెప్పి ఇంటికి పంపించారన్నారు. కానీ తనకు ఎలాంటి మెసేజ్ రాలేదన్నారు. రిపోర్టు రావడం ఆలస్యం కావడంతో వైద్యులకు చూపించుకోలేక పోయామని, దీంతో అర్ధరాత్రి తన కూతురుకు ఫీవర్ పెరిగి సీరియస్‌గా మారిందని, వెంటనే ఎంసీహెచ్‌కు తీసుకువస్తే పట్టించుకోక పోవడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సేవలు, ల్యాబ్ రిపోర్టు ఇవ్వడంలో జాప్యం చేస్తూ, ప్రాణాల మీదకు తెస్తున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు.

సన్మానం



బచ్చన్నపేట: జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ ప్రమాణ స్వీకారానికి మండలం నుంచి పలువురు నాయకులు సోమవారం తరలి వెళ్లి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్, సురేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, విద్యానాథ్, నరేష్, శ్రీనివాస్ ఉన్నారు.

మార్కెట్ డైరెక్టర్లకు..

రఘునాథపల్లి: జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేసిన మండలంలోని గాదె రమేశ్, ఎండీ బాషుమియా, తోటకూరి రమేశ్, బంద కుమారస్వామిలను కాంగ్రెస్ నేత, మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబు సోమవారం సన్మానించారు. బుచ్చయ్య, రవి, శ్రవణ్‌కుమార్, రాజిరెడ్డి, కుమార్, కిరణ్, శివప్రసాద్ ఉన్నారు.

నూతన ఉపాధ్యాయులకు..

పాలకుర్తి: ఇటీవల నూతన ఉపాధ్యాయులుగా ఎంపికై కోతులబాద, చెన్నూరు, పాలకుర్తిలో విధుల్లో చేరిన వారిని పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. సోమయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భజన మండలికి..

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్ గ్రామ శ్రీశివరామకృష్ణ భజన మండలి సభ్యులు వేములవాడ రాజన్న సన్నిధిలో ఘనంగా సన్మానం పొందినట్లు భజన మండలి అధ్యక్షుడు చింతల బాలయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీశివరామకృష్ణ భజన మండలి వ్యవస్థాపకుడు వేల్పుల పెద్దిరాజయ్య ఆధ్వర్యంలో 60వ వార్షికోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య నిత్యాన్న సత్రంలో భజన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. భజన పాటల్లో మొదటి స్థానం పొందిన మండలి సభ్యులను సన్మానించి మెమొంటోను నిర్వాహకులు అందించినట్లు పేర్కొన్నారు.

పలకల పంపిణీ

చిల్పూరు: మండలంలోని వెంకటాద్రిపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం మండల నాయకుడు మంతెన లవన్‌కుమార్ పలకలు, బలపాలు, స్వీట్లు సోమవారం పంపిణీ చేశారు.

సంక్షిప్త సమాచారం

కూతురు హర్షిక అక్షరాభ్యాసం పురస్కరించుకుని చిన్నారులకు పలకలు పంపిణీ చేసి అంగన్‌వాడీలో చేర్పించారు.

నేడు ఉప్పలమ్మ ఆలయ హుండీ లెక్కింపు

జనగామ: పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియా అమ్మబావి ఉప్పలమ్మ ఆలయ హుండీని నేడు(మంగళవారం) లెక్కించనున్నట్లు ఈఓ రాములు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే కొబ్బరి ముక్కల సేకరణ, అమ్మవారి చీరలను వేలం వేయనున్నట్లు తెలిపారు.

మా భూములకు హద్దులు ఏర్పాటు చేయండి

జనగామ రూరల్: దేవరుప్పుల మండలం చిన్నమడూరు గ్రామంలో దళితులకు కేటాయించిన భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కేవీపీఎస్ నాయకుడు గద్దం యాదగిరి, ఎల్లయ్య శ్రీనివాస్, నర్సయ్య, భాషపాక సోమయ్య పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు తొలగించాలి

పట్టణంలోని బెల్ట్ షాపులను తొలగించాలని కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి బొట్ల శ్రావణ్ కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

భూ వివాదం

చిల్పూరు: మండలంలోని దేశాయితండాలో సోదరులు అయిన మాజీ ఎంపీటీసీ యాదగిరి, భూక్య కొమురయ్య నడుమ భూ వివాదం నెలకొంది. సోమవారం ఉదయం ఇరు కుటుంబాల మధ్య పాత ఇంటి విషయంలో గొడవ చోటు చేసుకుంది. ఈ క్రమంలో వదిన అయిన వాలిపై యాదగిరి దాడికి పాల్పడ్డాడు. అడ్డుకోబోయిన వాలి కుమారుడికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఇద్దరిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

సముచిత స్థానం కల్పించాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో ప్రతిపక్ష పార్టీల నాయకులకు కూడా సముచిత స్థానం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ అన్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి కర్ణాకర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని లింగంపల్లి గ్రామంలో సోమవారం తాడెం రాములు అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తాడూరి వెంకటమ్మ, బలరాములు, పుట్ట సిద్దయ్య, జంగ పోచయ్య, నర్సింహులు, లక్ష్మి పాల్గొన్నారు.

బియ్యం అందజేత

నర్మెట గండి రామారం గ్రామానికి చెందిన గోవిందుల సరోజన మృతి చెందింది. కాగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు.

ఎంపీని కలిసిన ఐకేపీ వీఓఏలు

చిల్పూరు: తమ సమస్యలు పరిష్కరించాలని మండల మహిళా ఐకేపీ వీఓఏలు కోరారు. ఈ మేరకు హనుమకొండలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలను వేర్వేరుగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కాగా, ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి తక్షణమే సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

తరిగొప్పుల: పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి హెచ్చరించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా మాజీ మండల కోఆర్డినేటర్ కొయ్యడ రాజు కాంగ్రెస్ పార్టీని, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కించపరిచే విధంగా పోస్టులు పెడుతున్నాడని, జిల్లా అధ్యక్షుడి ఆదేశాల మేరకు కొయ్యడ రాజును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కనుకయ్య, శివకుమార్, లూకా పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి

రఘునాథపల్లి: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగ కైలాసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల విద్యావ్యవస్థ కుంటుపడుతుంటే.. పట్టించుకునే నాథుడే లేడన్నారు. మండలంలో ఇప్పటికే పది పాఠశాలల్లో విద్యార్థులు లేక మూత పడ్డాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పేదలు విద్యనభ్యసించే పాఠశాలలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆయన కోరారు.

ఓటరు లిస్టులో సవరణ వెంటనే చేయాలి

జఫర్‌గఢ్: ఓటరు లిస్టులో సవరణలు వెంటనే చేయాలని మండలంలోని రేగడితండా గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు.